


ఆలోచనకి అందని పూర్వస్మృతిలాగా రైలు అనుమానంతో కదిలింది. ప్రయత్నాలకి లొంగని ఆశల్లాగ దృష్టిని దాటుకొని దీపాలు వెనక్కు పోతున్నాయి. ప్లాట్‌ఫారమ్ వెనక్కు జరిగిపోయింది.

ఆలోచనలు వద్దనుకొంటున్నా ముందుకు త్రోసుకుపోతున్నాయి. నగరం 'చీకటితెర' వెనక చెరిగిపోతోంది. ఈ నగరంలోనే తన ఆశలూ, ఆనందం అన్నీ చెరిగిపోయాయి. గతం మనస్సుని కదిలించి, కళ్ళలో నీటిని త్రిప్పింది. పడమటి ఆకాశంలో మెరిసే ఒంటరి నక్షత్రం కంటి నీటిలో వెయ్యి వెలుగులుగా చెదిరిపోయి— అంతలో చీకటయింది.

రైలుకూత తట్టిలేపింది. చుట్టూచూసింది ఆమె. కంపార్టుమెంటులో ఎంతోమంది లేరు. ఓమూల నిద్రపోతున్న వృద్ధుడూ

## కె. వివేకానందమూర్తి

రైలు పరుగును గమనిస్తున్న కుర్రవాడూ, మరి నలుగురూ ఎదురుగా కనిపించారు. ఇవతలి చివరి కిటికీ చల్లగాలికి తోడుగా తను. తన కెదురుగా సీతాపతి రైలు కదిలిన అరగంటకి గుర్తుపట్టింది. అవును. సీతాపతే. సందేహం లేదు. నుదుటి మీద చిన్న మచ్చ. ఎప్పుడూ నవ్వుతున్నట్టుండే పెదాలూ – బాగా గుర్తు. తను పై బల్లల నీడలో వుండిపోయింది. అతనింకా చూడలేదు. అతనిపక్కనే – భార్య కాబోలు - కూచొని కునుకుతోంది. వాడిలో చంటిపిల్ల. రైలుదీపం వెలుగులో సీతాపతిలో మార్పుని గమనించడానికి ప్రయత్నించింది ఆమె. చాలా మారిపోయాడు. పెదాలమీద నవ్వు కాస్త చెరిగి, పట్టుదల సిద్ధమవుతోంది. తనకి తెలిసిన సీతాపతికి ఇరవై రెండేళ్ళు. ఇప్పుడు ముప్పదేళ్ళ సీతాపతి.

భర్తతోపాటు విజయవాడతో సంబంధం తీరిపోయి రెండేళ్ళయింది. జీవితంలో తను యింతగా ఎప్పుడూ నష్టపోలేదు. చిరునవ్వుతో, స్మితవదనంతో పలుకరించే భర్త లోపించాడు. అప్పుడు వాటి విలువ అర్ధమయేదికాదు. ఆడవానికి కొన్ని అవకాశాలూ, ఆశలూ జారిపోయాక మెలకువ కలుగుతుం దనిపించింది. అప్పటి సుఖం, ఆ రోజులూ, కృష్ణానదిముందు గడిపిన రాత్రులూ, ఇప్పటి ఒంటరితనం మీనా, నిస్సహాయతమీనా పగ తీర్చుకుంటున్నట్లున్నాయి; అనుభవాలకంటె, జ్ఞాపకాల శిక్ష ఎంత ఘోరమైనదో యిప్పుడర్ధమవుతోంది—ఏమయినా ఈ కలవరం కరిగిపోయేదికాదు.

ఆలోచనలు తెరలు తెరలుగా కమ్ముకుంటున్నాయి మనస్సులో. చీకటిమధ్య ఎక్కడో వెలుగు మెరిసి అంతలో మాయమయింది.

తను విశాఖపట్నంలో ఉంటున్న అన్నయ్య ఇంటికి వెళుతోంది. అన్నయ్యని చూడగానే పుట్టెడు దుఃఖం. తనమీద సానుభూతిని చూపడానికి, దుఃఖాన్ని పంచుకోడానికీ యింకెవ్వరున్నారు—ఈ అన్నయ్య తప్ప.

ఎదురుగా సీతాపతిభార్య చీరకొంగు సవరించుకొని, నుదుటి కుంకుమ సరిచేసుకొంది. తనూ చీరకొంగు సవరించుకొంది. నుదుట కుంకుమ లేదు. జీవితమంతా తనతో బ్రతకడానికి ఎన్నిక చేసుకొన్న నేస్తం హఠాత్తుగా దాన్ని చెరిపేసిపోయాడు. కలలోలాగా ఆ సంతోషం కరిగిపోయింది.

కన్నీరు చేతిమీదపడినా చలివేస్తోంది. నరాల్ని కొరికే చలి.

సీతాపతి చలిగాలికి వణికి, పైమీద వున్న శాలువాను చుట్టూ తిప్పుకొంటున్నాడు.

ఎనిమిదేళ్ళక్రితం సీతాపతికి తనమనస్సు చెప్పిన నిర్వచనాన్ని ఊహించుకొన్నది. ఎనిమిదేళ్ళక్రితం సీతాపతిని తను 'పతీ' అని పిలిచింది. అతను 'సీలీ' అనేవాడు. అలా మరొక్కరే తరువాత పిలిచారు. ఇప్పుడిక ఎవరూ పిలవరు.





తనూ, పతీ ఓ కాలేజీలో చదివారు. తనకు ప్రేమంటే ఏమిటో పతిని చూశాకనే తెలిసింది. అతని కళ్ళు తనకు 'కోరిక' మీద మొదటిపాఠాన్ని నేర్పాయి. అప్పట్లో తనకు పతినిగురించి పూర్తిగా తెలియక పతికి ప్రేమంటే తెలియదనుకొన్నది.

పతి, తన అన్నయ్యకి ప్రాణస్నేహితుడు. వాళ్ళస్నేహం తనకి అవకాశాన్ని కల్పించింది. పతి అన్నయ్యకోసం వచ్చేవాడు. తను పతికి అట్లా మనస్సులో దగ్గరపడడానికి అన్నయ్యతో స్నేహమే కారణం. అన్నయ్యా పతీ గంటల తరబడి మాట్లాడుతూండేవారు. వాళ్ళ మాటలకి కాలం ఎప్పుడూ చాలనట్లే అనిపించేది. పతి ఎంతసేపువున్నా తొందరగానే వెళ్ళిపోయినట్టనిపించేది. తనకు మధ్యలో కలుగజేసుకుని మాట్లాడాలని ఉండేది. కాని ఇరవై ఏళ్ళ యౌవనానికి ధైర్యం చేతకాలేదు - సిగ్గూ, పిరికితనం తప్ప. కళ్ళు మాట్లాడుకునేవి.

ఇప్పుడతనికళ్ళు చూసింది. చీకట్లో దేన్నో వెతుకుతున్నట్టున్నాయి. ఆమెవేపు

చూడడంలేదు.

రైలు ఎంతకీ తరగని దూరాన్ని గుండె పగులకొట్టే లయతో చీల్చుకుపోతోంది. ఆ 'లయ'కు క్రమంగా విసుగు కలుగుతోంది.

ఆ రోజుని తాను మరచిపోలేదు. అన్నయ్య యింట్లో లేడు. క్రితంరాత్రే ఉద్యోగ రీత్యా పక్కవూరు వెళ్ళాడు. పతి, రోజూలాగే యింటికి వచ్చాడు. బాగా గుర్తు. మబ్బువేసిన ఆకాశం - ఉక్కిరి బిక్కిరయిన మనస్సులాగ. డాబా మెట్లపైన మునుపులమీద తల ఆనించుకు కూర్చుంది తను. టకటకా బూట్లు చప్పుడు చేసుకొంటూ వచ్చి తన కిందిమెట్టుమీద కాలు ఆనించి ఆగాడు పతి. ఒక్క క్షణం గుండె ఆగినట్టనిపించింది. అంత దగ్గరలో పతిని ఎప్పుడూ చూడలేదు. అతనూ త్రుళ్ళిపడ్డాడు. అన్నయ్య లేడని తెలిసింది.

"మిమ్మల్ని చూడలేదు. ఏమీ అనుకోకండి." వెళ్ళిపోతూ అన్నాడు.

తను అతని ముఖం చూసింది. అంత భయపడతాడేం? మగవాళ్ళలో పిరికితనం, భయం బాగుండవు. "అన్నయ్య రాత్రి వరకూ రాడని తెలుసు. "కూచోండి. ఏ క్షణాన్నయినా అన్నయ్య వస్తాడేమో" అన్నాక తనకే నవ్వొచ్చింది. అతను నిజంగానమ్మాడు. అబద్ధానికి అంత విలువ వుందా అనిపించింది. కాని ఆ ఒక్క సాయంకాలం తన జీవితంలో ఎంత పెద్ద జ్ఞాపకాన్ని మిగిల్చిందా అనిపిస్తూంటుంది. ఆరోజు తను ప్రయత్నంతో పతిని ఆపకపోతే, ఇవాళ ఇట్లా పతిని చూడగానే ఆలోచనలు తెగిపోయి ఉండకపోను.

ఎన్నాళ్ళుగానో పరిచయం వున్న మిత్రుల్లాగ ఇద్దరూ మాట్లాడడం ప్రారంభించారు. గంటన్నరసేపు విసుగుదలతో కూచున్నాక నవ్వొచ్చింది.— "అన్నయ్య రాడనుకోండి. ఏం చేస్తారు?" అన్నది తను.

"అంటే?"

"నేను అబద్ధం చెప్పాననుకోండి—"

ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు. "అందమైనవాళ్ళు అబద్ధం చెప్పకూడదు. అయినా చెప్పారుకనక - క్షమిస్తాను"— అన్నాడు.

మనస్సు చివుక్కుమంది — ఎందుకలా చెప్పానా అని. కాని చెప్పకపోతే ఇవాళ ఈబాధ ఎలా దక్కుతుంది.

ఆతర్వాత చాలాసార్లు మాట్లాడుకున్నారు పతీ, తనూ. అతని కళ్ళు ఎప్పుడూ తనని పరీక్ష చేస్తూండేవి. తను మరీ చురుకుగా మాట్లాడితే, "ఇంత తెలివి ఉండడం మంచి అమ్మాయికి అర్హతకాదు." అన్నాడు ఓరోజు.

"అంటే."

"ఆడది అమాయికంగా ఉంటేనేఆనందం కలుగుతుంది. తెలివిగా,గొప్పగా మాట్లాడే స్త్రీని చూస్తే నాకు భయం వేస్తుంది—" నవ్వాడు.

ఆ మాటలు ఎందుకన్నాడో తెలీదు. ఆ రోజు అలా మాట్లాడకపోయినా బాగుణ్ననిపిస్తుంది. కాని ఆ రెండు మాటలనుగురించే ఆమె ఎన్నో నెలలు ఆలోచించింది. జీవితంలో మంచి స్నేహాన్ని ఎన్నుకోవడంలో తప్పటడుగు వేస్తున్నా ననిపించేది. చివరికి ఓరోజు అన్నయ్య 'పతి' విషయం అడిగితే ఇష్టంలేదని తను తల వూపింది. అన్నయ్య ఆశ్చర్యపోయాడు. కారణం అడిగితే ఒక్కటే కనిపించింది.



"అతను పిరికివాడు. ఆడదానిలో చొరవను సహించలేనంత పిరికివాడు. అందుకని వద్దు" అని. అన్నయ్య మాట్లాడలేదు.

పతి మళ్ళీ తనకి కనిపించలేదు. తరువాత రెండేళ్ళవరకూ తన జీవితంలో చెప్పుకోదగ్గ సంఘటన లేవీ జరగలేదు. రెండేళ్ళ తరువాత తనకి ఒక యింజనీరుతో పెళ్ళయింది. విజయవాడలో కాపురం. భర్తతో యాంత్రికంగా రోజులు గడిపింది—ఏడాదిన్నర గడిచింది—మోటారు సైకిలు ప్రమాదంలో భర్త చనిపోయాడు. ఆర్ద్రతతోకూడిన భావాలు తన్ను ఏడిపించాయి. తన దాంపత్య జీవితం విజయవాడలో గడిచింది. భర్త తన్ను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఇప్పుడు తను విజయవాడ విడిచిపెట్టి వెళ్ళిపోతోంది.

చలిగాలి భరించలేక ముసలాయన ఫ్యాను ఆపుచేశాడు. సీతాపతి నవ్వుతూ మాట్లాడుతున్నాడు. ఆమె నిశ్శబ్దంగా వింటోంది— ఎంత అన్యోన్యంగా వున్నారు! భార్యకి భర్తకు అంతకంటె కావలిసిందేముంది? వారి అన్యోన్యత, తన మనస్సులో ద్వైదీభావాన్ని మరింత కుదిపింది. ఒక్కసారిగా మనస్సులో భావసంచలనం కలిగింది.ఒక్క క్షణం - పతి తనవాడయినట్టు, ఎవరో పతిని వశపరచుకొన్నట్టు అనిపించింది. తనకు తెలియకుండానే తనలో జుగుప్స ప్రవేశించింది. రెండేళ్ళ పరిధిలో పతి సమక్షంలో జీవితం, అనుభూతులు అన్నీ గుర్తుకొచ్చి మరింతగా మనస్సుని కోతపెట్టాయి.....ఈ ఆలోచనలు మనస్సులో వున్న రాస్త బిగువుని హరాయించేస్తున్నాయి. ఇప్పుడిక ఏమనుకొనీ లాభం లేదు. - పతికి పెళ్ళయిపోయింది. భార్య దొరికింది. స్త్రీత్వానికి మంచి బహుమతి — కూతురు. ఆ పరిపూర్ణతకి అర్థం తనకు తెలీదు. తెలిసివుంటే బాగుండేదన్న తపనే మిగిలిపోయింది. ఇప్పుడు అనవసరంగా ఈ ఆలోచనలు కదిలాయి. ఎన్నాళ్ళయింది తను సుఖంగురించి ఆలోచించి.... ఇప్పుడు 'పతి' మళ్ళీ పాత జీవితాన్ని గుర్తుచేశాడు. స్త్రీ సహజమైన కోరికా, మనస్తాపం, యిప్పుడు తన మనస్సుని పతినిగురించి ఆలోచించినందుకు కోతకోస్తున్నాయి. పెళ్ళయిన పతిగురించి తనకీ ఆలోచన కూడదు. వారి దగ్గరతనం, అన్యోన్యం తనకి తెలియకుండానే తనమీద పగ తీర్చుకొంటున్నట్లున్నాయి. ఎందుకని? వారి జీవితాలతో తనకేం సంబంధం? ఎంత నచ్చచెప్పినా మనస్సు రాజీ పడడంలేదు. ఒక్క వాక్యంతో, ఒక్క అభిప్రాయంతో తమ జీవితాలు విడిపోయాయన్న కించ గుర్తుకొస్తోంది. ఒక్క అడుగులో తప్పిపోయిన గుర్రపుపందెంలాగ తన జీవితం ఓడిపోయింది.

ఘొరున ఏడవాలనిపిస్తోంది. ఎనిమిదేళ్ళలో పాత ఆలోచనలు వచ్చినప్పుడల్లా దుఃఖం ఇచ్చినంత హాయి మరేదీ యివ్వలేకపోయింది.

ఏలూరుస్టేషన్లో రైలు ఆగింది. ప్లాట్ఫారం దీపాలకాంతి తన ముఖంమీద పడింది. పతి తన్ను చూసి యిప్పుడు గుర్తుపడతాడేమో:—భయమేసింది. ప్రేమించి కోల్పోయిన స్త్రీగా తన్ను భార్యకు పరిచయం చేస్తే ?— తన్ను పతి చూడకూ

లేదు. — ముఖం దించుకుని తొందరగా ప్లాట్ ఫారమ్‌లోనికి దిగిందామె.

గుర్తుపట్టగానే ఎట్లా పలుకరిస్తాడో? ఆ ఒక్కవాక్యం తనని పోగొట్టుకునేందుకు కారణమయిందన్న బాధ అతనికి వుందా?- మగవాళ్ళ అవకాశాన్ని వెదుక్కొని త్వరగా దాటుకుపోతారు. - ఆడవాళ్ళు గతాన్ని పట్టుకు వ్రేలాడుతారు. భార్యతో యిందాకటి అతని నవ్వుగుర్తుకొచ్చాక ఆ ఆశ కూడా మాసిపోయింది. తను అతనికి జ్ఞాపకం ఉండి ఉండదు.

రైలుదిగి, పూలమ్మేవాడి దగ్గరకు నడిచాడు పతి. ఆమె దూరంగా నిలబడింది. పోయి కూర్చుందామనుకున్నది. - ఎవరో పిలిచారు.

"నీలవేణీ!"

గుండె పగిలింది.— ఆ పిలుపు ఎనిమిదేళ్ళ పాతది. కాని అలా పిలిచాడేం? పిలవకపోయినా బాగుణ్ణు. ఇక తప్పించుకుపోవడం సాధ్యంకాదు. దగ్గరికి వచ్చాడతను. అబ్బ! ఎంత దగ్గరికి!

" నువ్వు 'నీలీ' అని పిలిచేవాడివి అప్పుడు"—

అతను ఆశ్చర్యపోతున్నాడు. "ఏమిటి నువ్వా?—ఇక్కడ!! — ఆశ్చర్యం—" తను మాట్లాడకపోతే మరీ ఆశ్చర్య పోతున్నాడు. ఇద్దరికీ కూడా మాట్లాడ్డానికి మాటలు కరువయ్యాయి.

"త్వరగా తెచ్చిపెట్టండి. రైలు కదులుతోంది" అని హెచ్చరిస్తోంది భార్య.

" ఎక్కడ కూర్చున్నావు ? " అంటున్నాడు.

"నీకు ఎదురుగానే"

అడగవలసిన ప్రశ్నలు తప్ప అన్నీ అడుగుతున్నాడు.

"అరె! నేను చూడలేదే!"

"అవును చూడలేదు."

"చాలా మారిపోయావు నువ్వు."

"అవును మారిపోయాను."

"నన్ను గుర్తుపట్టావా?"

"ఆఁ. గుర్తుపట్టాను."

"మరి పలకరించలేదేం?"

"ఏం మాట్లాడాలో తెలియలేదు."

"చాలా విచిత్రంగా కలిశాం ఇవాళ".

"........................"

"చాలా ఆశ్చర్యంగా వుంది నాకు"

"............"

ఆ స్టేషన్లో తను ఏడుస్తుందేమోననిభయమేసింది. అటువంటి ప్రశ్నలతో ఎంతకోత పెడుతున్నాడో అతనికి అర్థంకావడంలేదు.

"లోపలికి రా"

"నీభార్యకు నన్నెలా పరిచయంచేస్తావు" అన్నది చాలానేపటికి. అతను తుళ్ళిపడ్డాడు. నావేపు వింతగా చూశాడు. అంతలోనే ఫక్కున నవ్వాడు.

"నా భార్యకు నిన్ను పరిచయంచేసే ప్రమాదంలేదు."

తాను దిమ్మెరబోయింది. "అయితే యిదంతా తెలుసా ఆవిడకి?"

రైలుపెట్టెలోంచి విచిత్రంగా మా వైపు చూస్తున్న ముఖం చూశాను.

"ఆ ప్రమాదంలేదు. మాఆవిడకి నిన్ను పరిచయంచేసే ప్రమాదం ఎన్నటికీరాదు. రైలుకదులుతుంది. పద." అన్నాడు తొందరగా.

పతి మల్లెపువ్వులతోనూ, తను బరు

వెక్కిన గుండెతోనూ రైలెక్కారు. వాళ్ళ ఎదురుగా తను ఎందుకుకూర్చున్నదా అన్న బాధ ఎక్కువయింది. ఇందాకటికంటె పెద్ద బాధ యిది.

"ఈమె నీలవేణి. ఎనిమిదేళ్ళక్రిందటి పరిచయం. వాళ్ళ అన్నయ్యా, నేనూ చదువుకున్నాం" అన్నాడు ఆమెతో. ఆమె చంటిపిల్లని వొళ్ళోకి మార్చుకుని సమస్కారం చేసింది.

"ఈమె మా వదినె. అన్నయ్య, మద్రాసునుంచి ఢిల్లీ యింటర్వ్యూకివెళ్ళాడు. నేనీమెని యింటికి తీసుకువెళ్తున్నాను-ఇది మా అన్నయ్య కూతురు." అని నవ్వుతున్నాడు. పతి నవ్వు ఆరోజుల్లో తనకి కోరిక అంటే ఏమిటో చెప్పినంతబలంగా పతి అంటే ఏమిటో చెప్పలేదు.

ఒక్కక్షణం గుండె కొట్టుకోవడం ఆగిపోయినట్టయింది.

భార్యకాదు - భార్యకాదు - అని వెయ్యిగొంతులతో మనస్సుఅరుస్తోంది. ఇందాకవాళ్ల మాటలూ-నవ్వులూ - తను ఆలోచనలను ఎంతగా పెంచుకుంది! ఎంత దురభిప్రాయపడింది?-!

"ఎంతవరకూ వస్తున్నారు?" అన్నది ఆవిడ పతి చేతిలోనిమల్లెపువ్వులు తీసుకుని.


"విశాఖపట్టణం."

"మేము రాజమండ్రిలో దిగిపోతాం." కొన్ని మల్లెపువ్వులుతీసి తనకివ్వబోయింది ఆమె. తాను తీసుకోలేకపోయింది.

"పువ్వులంటే నాకెంతో యిష్టం-పెట్టుకోండి. "

"ఫరవాలేదు. మీరుపెట్టుకోండి - నా కా అదృష్టం తీరిపోయింది."తనకు ఏడుపు ఆగలేదు. ఆమె వెంటనే బాధపడింది.

"తెలియక అడిగాను క్షమించండి.— అవన్నీ కాసేపు మరచిపొండి. బాధపడి



ప్రయోజనంలేదు" ఆమె వ్యథితురాలయింది. ఆమె మల్లెపువ్వులుతురుముకోలేదు. ప్రక్కన పెట్టేసింది.మల్లెపువ్వులు గుబాళించాయి. మల్లెపువ్వుల మత్తులో పాతఅనుభవాలు జ్ఞాపకాన్ని పట్టుకు వేధించాయి.

చంటిపిల్ల ఏడిచింది. ఆమె పిల్లని సముదాయించడంలో మునిగిపోయింది - ఆ అనుభవం తనకి కొత్త-ఆ పిల్లఏడుపు తనస్త్రీత్వంలో అసమగ్రతను ప్రకటిస్తోంది.

గంటక్రితం తన ఆలోచనలు, తన భావాలు ఒక్కసారిగా మనస్సుని తూట్లుపడేటట్లుచేశాయి. తనకు తనమీదే అసహ్యం వేసింది. పతితో రెండేళ్ళ పరిచయం యిప్పుడు తన మనస్సుమీద, తన ఆశల మీద రాజ్యం ఏలింది.

చంటిపిల్ల నిద్రపోయింది. పతి వదిన గారికి కునుకుపట్టింది.పతిమాత్రం మౌనంగా కూచొన్నాడు. చీకటివేపు చూస్తున్నాడు. చీకటిలాంటి గతాన్ని ఆ నిశ్శబ్దంలో చదువుకొంటున్నాడు కాబోలు. నవ్వొచ్చింది.

అంతలోనే తనమనస్సు ఎందుకో తేలికయిపోతున్నట్లుంది. ఆమె భార్యకాదు. వారిద్దరి అన్యోన్యం నిజంకాదు. ఆ పిల్ల పతి కూతురుకాదు. తను వూహించిన స్వర్గసుఖం పతి అనుభవించడంలేదు. ఎంతోతేలికయిపోయింది మనస్సు. గాలిలో తేలిపోతున్నట్టుంది తనకు. ఎందుకని? పతి సుఖం తను వూహించినంతగాలేదనా?- ఏమో? అతనికీపెళ్ళై వుండవచ్చు. నాలుగేళ్ళగా అతనివిషయం ఏమీతెలియదు.భార్య, పిల్లలూ వున్నారేమో-ఏమైనా ఇంతవరకూ చూసినదంతా నిజం కాలేదు. మనస్సు గంతులు వేస్తోంది.

చీకటి రైలుకిదూరంగా మరీదట్టంగాపేరుకొంటోంది. బరువైనగంటలు అర్ధరాత్రి వేపు జరుగుతున్నాయి.

నిశ్శబ్దం ఆసరాగా చేసుకుని మళ్ళీఆలోచనలు కట్లుతెంచుకున్నాయి. ఇంటిదగ్గర పతి భార్య వుండిఉంటుంది. అతనికి ఎందరు పిల్లలో? ఆమెతో అన్యోన్యంగా ఉంటాడో? ఉండేవుంటాడు - పతిలో ఏరకంగానూ, విచారం, విషాదం కనిపించడంలేదు. అందుకని భార్యమీద అసంతృప్తివుండి వుండదు. అదృష్టవంతుడు పతి. తనకాఅదృష్టందక్కలేదు. తనజీవితంలో అప్పుడే చివరి అధ్యాయం వచ్చేసింది. పతి జీవితానికి యింకా ప్రారంభమే అయింది - అతనిభార్య ఎలా వుంటుందో? అడిగితే బావుణ్ను.

కిటికీకి ఆనుకొని నిద్రపోతున్నాడతను. తనకు ఎంతప్రయత్నించినా నిద్రపట్టడంలేదు. పతిభార్యనుగురించి ఆలోచన ఇప్పుడే రేగింది.చల్లగాలి మరీఎక్కువైంది. ఆలోచనలమధ్య ఎప్పుడు వెనక్కి జారబడిందో తెలియదు. వంటిచుట్టూవున్న కొంగు విసురుగా ఒక్కసారి ముఖానికి కొట్టుకుంటే తెలివొచ్చింది. గోదావరినదిమీదనుంచి మెల్లగా పాకుతోంది రైలు. పతిలేచాడు. పాపనిచేతుల్లోకి తీసుకుని 'చూడు వదినా' అంటున్నాడు.

ఆమె చిన్నపిల్లలాగ నవ్వుతూ అటు తిరిగి కూచుంది-ఇటుతిరిగితే పతికి తనుఎదురయింది.

"మా వదినెకి ఇలాంటి ప్రయాణాలు క్రొత్త." నవ్వుతూ భుజంమీదపిల్లని పొందికగా ఎత్తుకున్నాడు. పిల్లలుఉన్నారేమో.

ఆమెకు వినిపించకుండా అడిగింది హఠాత్తుగా.

"మరి నీభార్యకో"

తెల్లబోయాడు, అంతలో బిగ్గరగా నవ్వాడు. వదినె త్రుళ్ళిపడి ఇటుతిరిగింది, "ఏమిటది?" అంటూ.

తనలో వణుకు పుట్టింది.

"చూడువదినా, నాభార్యగురించి అడుగుతోంది ఈమె" నవ్వుతున్నాడు. ఆమెకూడా పక్కున నవ్వింది. అంతలో తనముఖంలో ఆశ్చర్యాన్ని గమనించి ఆగిపోయింది. గోదావరి వంతెనకింద ఇనుపరేకులు విరిగినట్లు శబ్దంవస్తోంది; నది రోదిస్తున్నట్టు, చల్లగాలి చెవుల్ని రాసుకుపోతోంది.

"మా మరిదికి పెళ్ళికాలేదండి" అంటోంది వదినెగారు. మళ్ళీ గుండె ఆగినంత పనయింది-

నిజమా!!—ఎందుకని ? ? — ఎందుకు పెళ్ళిచేసుకోలేదు పతి ? రాజమండ్రి దగ్గర పడుతోంది. అక్కడ దిగిపోతారు వాళ్ళు. ఎందుకు పెళ్ళిచేసుకోలేదు. తనవల్లనేనా?- తను అరోజు కాదని త్రోసివేయడం కారణమా ? తనమీద ఆశతోనే మానేసివుంటాడా?- ఆలోచనలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి-గోదావరి చల్లగాలి ఉడికిపోతున్న ఆవిరిలాగ చెవులకు తాకుతోంది. రైలు చప్పుడు వినిపించడంలేదు.

ఆలోచనలు—ఆలోచనలు-

పతి పెళ్ళిచేసుకోకపోవడానికి అదే కారణమయితే ఎంతబాగుణ్ను!. మనస్సు ఉరకలువేస్తోంది - నిజంగా తలచినట్టే తన కోసమే బ్రహ్మచారిగా వుండిపోయాడా పతి?- అంతప్రేమవుందా తనమీద?- ఈ ఎనిమిదేళ్ళూ అతనిమనసులో తన ఆలోచనలే ఉన్నాయా?—పతిముఖం క్షణకాలం దీక్షగాచూసింది. బెడ్డింగులు సర్దుతున్నాడు. తనవేపు చూడడంలేదు—

తన ఆలోచనే అతనిలో ఇంతవరకూ వుంటే ? ఎంతబాగుణ్ను!-? ఉంటే ఏం లాభం:- కాని వుంటే, ఎంతబావుణ్ను— ఇక తోచనివ్వడంలేదు మనస్సు-? ఆ ఆలోచన ఉన్నదీలేనిదీ తెలుసుకోవడానికి ఏప్రశ్న వేస్తే సమాధానం చెప్తాడు?

రైలు లంఘించి గోదావరిస్టేషన్ దాటిపోతున్నట్టుంది. ఈమధ్యన పదిగంటలు ఆలస్యమయితే ఎంతబాగుణ్ను?-

"మనఇంటికి ఓసారిరమ్మను వదినా:" అంటున్నాడు పతి,ఆమె యిటుతిరిగిఆహ్వానించింది.

"వస్తాను. వస్తాను." అన్నది తను గాభరాగా - కాని వచ్చిఏంలాభం? - ఎలా వచ్చేదీ?- అనుకునేంతలో మరోఆలోచన-

ఆయన పోయినవిషయం పతికితెలుసా?

ఏం ఆలోచిస్తాడో తెలిస్తే?

తన ఒంటరితనం అతనికేమైనా ఆశనిస్తుందా?-

తెల్లబోయిచూస్తాడా?- అప్పుడింకా తన గురించి ఆలోచిస్తాడా?-

రాజమండ్రి ప్లాట్‌ఫారందీపాలు దూరంగా కనిపిస్తున్నాయి. పిల్లని తనచేతిలోకి తీసుకున్నాడు పతి.

తనమనస్సుతీసే పరుగులు అతనికితెలిస్తే బాగుణ్ను. ఎలా?- ఇన్నిప్రశ్నలు ఇలాగే మిగిలిపోతే - మరోక్షణంలో గుండె పగులుతుంది.

● రైలు ఆగుతూచేసిన శబ్దం పది అగ్ని పర్వతాలు బ్రద్దలయినట్లనిపించింది. వదినె దిగింది.

కూలీలు సామానులు తీస్తున్నారు.

ఎవరో ముసలాయనవచ్చి ఆమెనుపలకరిస్తున్నాడు-మామగారుకాబోలు - పతి దిగిపోతాడా-తనని పలకరించడా?-

ఒకేప్రశ్న —

"మరి వెళ్తాను నీలవేణీ - ఎప్పుడన్నా ఇక్కడదిగు - ఆర్ట్సుకాలేజీలో లెక్చరర్ని నేను-"

"పతీ !"

ఆశ్చర్యపోయి ఆగాడు పతి.

కంపార్టుమెంటులో గొడవగావుంది.

గార్డు ఈలవేశాడు.

తండ్రి పిలుస్తున్నాడు.

కిటికీదగ్గరగావచ్చి 'చెప్పు' అన్నాడు. అతనికళ్ళు ఇంకానవ్వుతున్నాయి-

"ఆయన పోయారు తెలుసా ?"

"అవును. పాపం. పేపర్లో చదివాను. మీఅడ్రసు తెలీదు. రానేవాణ్నే." మనస్సు ఇక బాధవద్దని మూలిగింది. అతనిలో సానుభూతితప్ప ఇంకేమీలేదు.

మనస్సు ఆరాటంలో మరొకప్రశ్న —

"పతీ! ఎందుకు పెళ్ళిచేసుకోలేదు నువ్వు?—నాగురించా ?-" చివరిమాట మనస్సులోనే మిగిలిపోయింది. అడగాలనిపించింది. అడిగేశాననుకొన్నది.

"మూడేళ్లక్రితం డబుల్ టైఫాయిడ్ వచ్చింది. రక్తంబాగా పొడయిందట. గుండె బాగాపీరసమయిపోయింది. పెళ్ళి చేసుకోవద్దని డాక్టర్లన్నారు. వస్తాను.

ఇక్కడ దిగడం మరచిపోకు."

పతికదిలాడు.

అంతేనా?-

అంతచిన్న కారణమా?- రైలుకదిలింది. మనస్సులో వెయ్యి అగ్నిపర్వతాలు బ్రద్దలయ్యాయి. రాజమండ్రి ప్లాట్‌ఫారం దీపాలు వెనక్కి జరుగుతున్నాయి - మనస్సులో మహారణ్యం తగులబడిపోతోంది. పతి అడుగుల బరువుతనంతో, తన హృదయపు బరువుతనం ప్రతికలవడంలేదు. పతి వెళ్ళేవైపు వెలితిగా చూసింది. నిట్టూర్చింది.

రైలెక్కిన పాతనీలవేణికాదు యిప్పుడు తను - ఏంజరిగింది? ఎదో జరిగింది. మళ్ళీ తేరుకోలేనిదెబ్బ-చీకటిలోతలదూర్చిదుఃఖం ఆపుకొన్నది.


ప్లాట్‌ఫారమ్ వెనక్కిజరిగిపోయింది. ●








# మెదడుకు మేధ



పక్కబొమ్మలో మొత్తం నాలుగుపెద్దవలయాలు, వాటిమీద నాలుగు వరసలలో 16 చిన్నవలయాలు వున్నాయి. చిన్న వలయాలలో ఒక్కొక్కదానిలోఒక్కొక్కఅంకె చొప్పున, 1 నుంచి 16వరకు అంకెలనువేస్తే, ఏవరసలోని అంకెలనుకూడినా34 రావాలి.

అంతేకాదు. బొమ్మలో నాలుగుపెద్దవలయాలున్నాయి గదా. అన్నిటికంటె లోపలి వలయంమీదగల నాలుగు చిన్నవలయాలలోని అంకెల మొత్తంకంటే దానితరువాతపెద్దవలయంమీదవేసినఅంకెలమొత్తం 16 ఎక్కువ వుండాలి.దానికంటె దానితరువాత వలయంమీదఅంకెల మొత్తంకూడా 16 ఎక్కువ వుండాలి. అలాగే దానికంటె దానితరువాత-అంటే, ఆఖరి పెద్దవలయంమీదవేసినఅంకెలమొత్తం16 ఎక్కువవుండాలి.

ఈ మాదిరి ఫలితాలు వచ్చేవిధంగా మీరు అంకెలను 1 నుంచి 16 వరకు చిన్నవలయాలలో వేసుకుంటూ పోవాలి. మీరు ఎంత త్వరగా వేయగలిగితే అంత గొప్పవాళ్ళన్నమాట.

——— సమాధానం ———

కింద ఎడమవరుసలో వెలుపలినుంచి లోపలికి 16, 9, 8, 1-కుడివరుసలో 13, 12, 5, 4 - పైన ఎడమ వరుసలో 15, 10, 7, 2 - కుడివరుసలో 14, 11, 6, 3 వెయ్యండి.